

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట | జోగులాంబ గద్వాల | వనపర్తి | నారాయణపేట | నాగర్ కర్నూల్

సోమవారం

02 నవంబర్ 2026





సొంత కార్లకు
ఏడాదికి రూ.1,500కే లోకల్ పాస్

పుల్కల్, నవంబర్ 1 (జనంసాక్షి): ఉమ్మడి మండల పరిధిలోని తాడ్‌దాన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద సొంత కార్ల యజమానులకు NHAI శుభవార్త అందించింది. ఇప్పటివరకు నెలకు రూ.360గా ఉన్న లోకల్ పాస్‌ను ఏడాదికి రూ.1,500కే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈరోజు నుంచి వార్షిక లోకల్ పాస్‌లు జారీ చేస్తున్నట్లు సమాచారం. అర్హులైన వాహనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, పాస్ పొందే ముందు టోల్ ప్లాజా సిబ్బందిని సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

అక్రమ
మట్టి దందాలో దళారుల హవా..!

- రెండు టిప్పర్లు పట్టుకున్న పోలీసులు



పుల్కల్, నవంబర్ 01 (జనంసాక్షి):
సంగారెడ్డి జిల్లా ఉమ్మడి పుల్కల్, చౌటకూరు మండలాల పరిధిలోని పరిశ్రమలకు దళారులు సంగారెడ్డి పట్టణ పరిసర ప్రాంతాల నుంచి మట్టిని తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ దందాపై సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి రెండు టిప్పర్లను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మైనింగ్ అధికారులు అక్రమ మట్టి దందాపై దృష్టి సారించకపోవడం వల్లే దళారుల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఎస్ఐఆర్‌పై విపక్షాల కుట్రలను మేధావులే తిప్పికొట్టాలి

- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని మేధావులకు ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 1(జనంసాక్షి): ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజల్లో అనవసరమైన అనుమానాలు, అపోహలు సృష్టిస్తూ తప్పుదు ప్రచారం చేస్తున్నాయని ఎంపీ డీకే అరుణ విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని అస్థిర పరిచే విపక్షాల కుట్రలను మేధావులే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన మేధావుల సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై మేధావులతో సుదీర్ఘంగా చర్చించి, వాస్తవాలను ప్రజలకు వివరించి ప్రతిపక్షాలు సృష్టిస్తున్న అపోహలు, అనుమానాలు తొలగించాలని కోరారు.సర్ ప్రక్రియ దేశంలో తొలిసారి జరుగుతున్నదేమీ కాదని, 1952 నుంచి ఇప్పటివరకు ఎనిమిది సార్లు ఓటరు జాబితాల సవరణ జరిగిం దని తెలిపారు. ఇందులో అత్యధికంగా కాంగ్రెస్ పాల నలోనే సవరణలు చేపట్టారని గుర్తుచేశారు. కేరళలో సర్ వల్లే అధికారంలోకి వచ్చామని కేరళ హోం మంత్రి రమేష్ చెన్నితల



వ్యాఖ్యానించారాని గుర్తు చేశారు.గతంలో ఎన్నికల సంఘం కమిషనర్లకు రాజకీయ పదవులు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి ఎదు రైన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ ఈవిఎంలను తప్పుబదుతోందని, కర్ణాటకలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్ విధానం జరిగినప్పటికీ కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్య వ్యవస్థలను తప్పుబట్టడం సరైంది కాదన్నారు. ఓటరు జాబితాల్లో ఉన్న డూప్లికేట్, డబుల్ ఓట్లతో పాటు మరణించిన వారి పేర్లను తొలగించకూడదా? అని ప్రశ్నించారు. గతంలో నమోదైన నకిలీ, డూప్లికేట్ ఓట్ల ను అధికారులు తొలగిస్తున్నందునే కాంగ్రెస్ పార్టీ ఆందోళన చెందుతోందని, ఆ డూప్లికేట్ ఓట్లన్నీ కాంగ్రె స్ పార్టీ నమోదు చేయించిందా అని విమర్శించారు.ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాలు, వివిధ సమస్యలతో సతమతమవుతుంటే, భారతదేశంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని డీకే అరుణ అన్నారు. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుండటం, ప్రధాని నరేంద్ర మోదీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలే కపోతోందని విమర్శించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, దేశాన్ని విచ్ఛిన్నం చేసి, కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని కలలు కంటోందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగురావు నామాజీ, రతం గ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, ఆర్ఎస్ఎస్ పెద్దలు ఎల్లప్ప, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు రఘురామయ్య, మున్సిప ల్ చైర్మన్ శ్వేత, వైస్ చైర్మన్ మంజుల, పట్టణ బీజేపీ అధ్యక్షుడు పోషల్ వినోద్, నారాయణపేట జిల్లా ప్రముఖులు, పార్టీ ముఖ్య నాయకులు, వివిధ వర్గాలకు చెందిన మేధావులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 1(జనంసాక్షి):



నారాయణపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నవంబర్ 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాగే ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడే విధంగా ఎలాంటి కార్యక్ర మాలు నిర్వహించేందుకు అనుమతి లేదని తెలిపా రు.ప్రజా జీవనానికి, రాకపోకలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా సమావేశాలు నిర్వహించడం, జన సమూహాలను ఏర్పాటు చేయడం నిషే ధమని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించి అనుమతులు లేకుండా కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా మతాల మధ్య విద్వేషాలు రెచ్చ గొట్టేలా, ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే తప్పుడు వార్తలు, అభ్యంతరకరమైన పోస్టులు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 30 పోలీస్ యాక్ట్ ప్రకారం జారీచేసిన ఆదేశాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఏదైనా కార్యక్రమం నిర్వహించాలనుకునే నిర్వాహకులు ముందుగానే పోలీసు శాఖకు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు పోలీసు శాఖకు సహకరిం చాలని కోరారు.

కేజీబీవీల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీలు

- పదో తరగతి విద్యార్థినులకు గణిత పాఠాలు బోధించిన రమేష్ కుమార్
- రాకొండ కేజీబీవీలో బూట్ల పంపిణీ.. విద్యా ప్రమాణాల పెంపునకు సూచనలు



తెలకపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి): మండల పరిధిలోని రాకొండ కేజీబీవీ పాఠశాలలను జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) రమేష్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా విద్యార్థినుల హాజరు, వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడిన డీఈఓ వారి విద్యా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా గణిత పాఠాలు బోధిస్తూ పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను పరిశీలించారు. పదో తరగతి పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని, ప్రతి సబ్జెక్టుపై పట్టు



సాధించాలని సూచించారు.
అనంతరం కేజీబీవీలో విద్యార్థినులకు బూట్లు పంపిణీ చేశారు. పాఠశాలలోని సమస్యలు, వసతి సౌకర్యాల గురించి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపించి మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెక్స్‌బుక్ మేనేజర్ నరసింహులు, కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం
నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య

మిగతా 7లో..



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 1 (జనంసాక్షి):
నాగర్‌కర్నూల్ జిల్లాలో బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులపై అదనపు భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ ధరలకే బియ్యాన్ని విక్రయించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. చేన్నయ్య జిల్లాలోని వ్యాపారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి నిర్ణీత ధరల కంటే అధికంగా బియ్యం విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో అదనపు కలెక్టర్ బి చేన్నయ్య వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధుల మధ్య నిర్వహించిన సమావేశంలో వివిధ రకాల బియ్యం విక్రయాలకు సంబంధించి గరిష్ఠ ధరలను ఖరారు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66, సోనా బియ్యం కిలో రూ.74, శ్రీరామ్ గోల్డ్ బియ్యం కిలో రూ.79కు మించి

జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం రాహుల్ గాంధీ పోరాటంలో మేమంతా సైనికులమే

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, నవంబర్ 01 (జనంసాక్షి): కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తామంతా అండగా ఉంటామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు బచావో-దేశ్ బచావో బహిరంగ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగ్గారెడ్డి భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి ఆయన సభను వీక్షించారు. ర్యాలీ నుంచి నాయకుల ప్రసంగాల వరకు ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు.

ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం సాగిస్తున్న ఉద్యమానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త మద్దతుగా నిలవాలని అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే వరకు కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.





దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ పాలనలో మాదిరిగా పేదలు సంతోషంగా జీవించే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. యువత, మహిళలు, రైతుల సంక్షేమం, దేశ ప్రజల భద్రత కోసం రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. తన భార్య నిర్మలతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఢిల్లీ సభకు వెళ్లారని, తాను సంగారెడ్డిలో ప్రజలు, కార్యకర్తలతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించినట్లు జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న పోరాటానికి తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఓటు బచావో కార్యక్రమంలో పాల్గొన్న రాయికోడు కాంగ్రెస్ నాయకులు



రాయికోడు, నవంబర్ 1 (జనంసాక్షి): న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు బచావో-దేశ్ బచావో కార్యక్రమంలో రాయికోడు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.అంజయ్య, రాయికోడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేదార్నాథ్ పటేల్ కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. ఏఐసీసీ అగ్రనేతలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు కూడా పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ యువ నాయకులు



సంగారెడ్డి, నవంబర్ 01(జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా పట్టి పల్లి మండల బిఆర్ ఎస్ యువ నాయకుడు తలారి శ్రీనివాస్ ఆందోల్ మాజీ శాసన సభ్యులు చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అభాగ్యులకు మాజీ జడ్పీటిసి అప్పన్న హస్తం



శివ్వంపేట, నవంబర్ 1 (జనంసాక్షి): మండలంలో పలు బాధిత కుటుంబాలకు మాజీ జెడ్పిటిసి పబ్బా మహేశ్ గుప్తా మానవతా దృక్పథంతో తన తోచిన విధంగా ఆర్థిక సహకారాలు అందజేస్తూ, అందరి అభినందనలు అందుకుంటున్నారు. అందులో భాగంగానే ఆదివారం శివ్వంపేట మండలం లింగోజిగూడ గ్రామానికి చెందిన రేణుక కుటుంబానికి రూ. 5వేలు, లింగోజిగూడ తండాకు చెందిన మాలోత్ సిద్దుకు రూ. 5వేల చొప్పున మొత్తం రూ. 10వేల ఆర్థిక సహాయాన్ని మాజీ జడ్పీటీసీ పబ్బా మహేశ్ గుప్తా, స్థానిక సర్పంచ్ అమృత అశోక్ గౌడ్ తో కలసి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసంపల్లి అరవింద్ గౌడ్, ఎల్లం, నర్సింలు, రాజు, రమేశ్, నాగరాజు, సాయిరాం, కిష్టాగౌడ్ గ్రామస్థులు ఉన్నారు.

అరాచకవాదాన్ని అంతం చేయడమే లక్ష్యం

- నేడు హైదరాబాద్‌లో బీజేపీ మహాపాదయాత్ర
- వెంకట రాములు ముదిరాజ్



మక్తల్, నవంబర్ 1 (జనంసాక్షి): అరాచకవాదాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్దేశంతో నేడు హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీజేపీ మహాపాదయాత్రను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా నారాయణపేట జిల్లా అధ్యక్షులు వెంకట రాములు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో బీజేపీని ఎదుర్కొలేక కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలపై నిరాధార ఆరోపణలు చేస్తూ కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా జరిగిన 28 ఎమ్మెల్సీ స్థానాలలో కేవలం ఒక్క స్థానం మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ తీరుపై ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీ అరాచకాలను తిప్పి కొట్టేందుకే ఈ మహాపాదయాత్ర చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి బీజేపీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: జరుపుల భాస్కర్ నాయక్



జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి): జడ్చర్ల 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పేరుతో స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డిలు రాజకీయ ఆరోపణలు చేసుకుంటూ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తున్నారని స్వచ్ఛంద సేవకుడు జరుపుల భాస్కర్ నాయక్ ఆరోపించారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఫోటోగ్రాఫర్స్ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆసుపత్రి కడతామని ఒకరు, స్థలం ఇస్తామని మరొకరు ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో ఏదీ చూపించడం లేదని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో సరైన రోడ్లు, ఉపాధి అవకాశాలు లేక ప్రతి గ్రామంలో వందలాది మంది యువకులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు అనవసర హామీలు మానుకోకపోతే 200 గ్రామ పంచాయతీల నుంచి యువతతో వచ్చి ప్రజా ప్రతినిధులను గట్టిగా నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా కేతకీలో పూజలు..



ఝరాసంగం, నవంబర్ 1 (జనంసాక్షి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆదివారం బీబీ పాటిల్ పుట్టినరోజు సందర్భంగా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో వెలసిన శివలింగానికి అభిషేకం నిర్వహించి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఆయన వెంట మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జానీకి రూ.5 వేల ఆర్థికసాయం



కల్వకుర్తి,నవంబర్ 1(జనంసాక్షి): కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జేపీనగర్ తండాకు చెందిన జానీని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంతో కలిసి పరామర్శించారు.

జానీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందుకోవాలని ఆకాంక్షిస్తూ రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుట్ట రాంరెడ్డి, వార్డు సభ్యులు సునీత ఆనంద్, నరేష్, కిషోర్, నాయకులు రామకృష్ణ,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా..

మంగంపేట మాజీ సర్పంచ్‌కు గాయాలు

మహమ్మదాబాద్, నవంబర్ 01(జనంసాక్షి): కారు అదుపుతప్పి బోల్తా పడి మంగంపేట తండా మాజీ సర్పంచ్ గీత,పాండుతో పాటు ఆమె భర్త పాండుకు గాయాలైన ఘటన,గండీడ్ మండలం గోవింద్‌పల్లి పరిధిలో రాత్రి చోటుచేసుకుంది.

సమాచారం మేరకు..ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడటంతో మాజీ సర్పంచ్ గీతకు స్వల్ప గాయాలయ్యాయి.ఆమె భర్త పాండుకు చేతికి ఫ్రాక్చర్ అయినట్లు తెలిసింది.

ప్రమాదం అనంతరం క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ఓ ఆస్పత్రికి తరలించగా,ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో బొంతపల్లి దుర్గమ్మ తల్లి బోనాల జాతర

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 1 (జనంసాక్షి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో దుర్గమ్మ తల్లి బోనాల జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌తో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని దుర్గమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చక్రపాణి, కుమార్ గౌడ్, విజయలక్ష్మి, రాజశేఖర్, మురళి, పద్మ, జయపాల్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్, వెంకట్ రామ్ రెడ్డి, హుస్సేన్, తుపాకుల రాజు, సత్యనారాయణ, శేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, మహేష్, రమేష్, వినోద్ గౌడ్, శంకర్, నాగేష్ గౌడ్, చందు, కౌశిక్ గౌడ్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



వనపర్తి రూరల్, నవంబర్ 1 (జనంసాక్షి): బీఆర్ఎస్ నాయకుడు ఏ.కే. పాషా బావమరిది జియా వివాహం ఇటీవల జరగగా, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, ఏ.కే. పాషా, సయ్యద్ జమీల్, అలీం, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి నాగరాజు గౌడ్ ఆర్థిక చేయూత



ఉర్కొండ, నవంబర్ 1 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలం ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన కొండ శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బీఆర్ఎస్ మండల నాయకులు, రోహిత్ ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత కొమ్మగోని నాగరాజు గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి తక్షణ సహాయంగా రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం అందించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బ మైసయ్య, కానుగుల బుచ్చయ్య, దుబ్బ బాలస్వామి, మాడ్గుల రమేష్, చక్కని బాల్‌రాజ్, కానుగుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడు, నవంబర్ 1 (జనంసాక్షి): నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్న పాటిల్ అన్నారు. ఆదివారం రాయికోడు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సంఘయ్య స్వామి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఆయన బాలాజీ నర్సింలు, బసవరాజ్ పటేల్, సర్పంచ్ చరణ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో మండలంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లి మల్యాల కుటుంబంలో మైసమ్మ పండుగ



చేర్యాల, నవంబర్ 01(జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో మల్యాల కుటుంబ ఆధ్వర్యంలో ఆదివారం వ్యవసాయ బావి వద్ద మైసమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే ఈ పండుగలో భాగంగా మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యానగర్ సమస్యలపై నిరంజన్ రెడ్డి చొరవ

- మంచినీరు, సీసీ రోడ్లు, మురుగు కాలువల సమస్యలపై అధికారులకు సూచనలు

వనపర్తి రూరల్, నవంబర్ 1 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలో భాగంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి పట్టణంలోని 9వ వార్డు విద్యానగర్ కాలనీలో పర్యటించారు. కాలనీవాసుల ఆహ్వానం మేరకు అక్కడికి చేరుకున్న ఆయన స్థానిక సమస్యలను ప్రజలతో కలిసి పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా కాలనీలో మంచినీటి సరఫరా, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్‌తో ఫోన్‌లో మాట్లాడి మిషన్ భగీరథ ద్వారా కాలనీకి మంచినీటి సరఫరా అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే మున్సిపల్ అధికారులతో మాట్లాడి అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలని, మురుగు కాలువల పనులు త్వరగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.





గతంలోనూ విద్యానగర్ కాలనీలో వీధి రోడ్డు సమస్య పరిష్కారానికి నిరంజన్ రెడ్డి కృషి చేశారని కాలనీ వాసులు గుర్తుచేశారు. ప్రస్తుతం తమ సమస్యలను స్వయంగా పరిశీలించి అధికారులతో మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన...

అనంతరం కాలనీ వాసులతో నిర్వహించిన సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రాధాన్యతను నిరంజన్ రెడ్డి వివరించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఒక్క అర్హుడి ఓటు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పట్టభద్రులు బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, భేదాడి అనిత కుమార్, మాజీ మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాసులు, కాలనీ పెద్దలు వెంకటేష్ గౌడ్, వెంకట్ రెడ్డి, నరసింహ రెడ్డి, చెవ్వా వెంకటేశ్వర్లు, చిన్నారెడ్డి, మునీరు, రాములు, వెంకటేశ్వర్లు శెట్టి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

- దంపతులకు శుభాకాంక్షలు తెలిపి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్ష

వనపర్తి రూరల్, నవంబర్ 01 (జనంసాక్షి): వనపర్తి పట్టణంలోని కేడీఆర్ 32వ వార్డుకు చెందిన పండితులు సుధాకర్ ఆచారి నూతన గృహ ప్రవేశ వేడుక శుభ సందర్భంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సుధాకర్ ఆచారి దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన గృహంలో సుధాకర్ ఆచారి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని నిరంజన్ రెడ్డి ఆకాంక్షించారు. నూతన గృహ ప్రవేశం వారి కుటుంబంలో ఆనందం, సంతోషం, శుభపరిణామాలకు నాంది కావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, బైక్ అమర్, తోట శీను తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

డబ్బు వివాదం.. కోడలు అదృశ్యం

- అంతర్గామలో కలకలం



సిర్గాపూర్, నవంబర్ 1 (జనంసాక్షి): మండల పరిధిలోని అంతర్గామ గ్రామంలో డబ్బు వివాదంతో ఓ మహిళ ఇంటి నుండి వెళ్లిపోయిన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఈగ చందర్, తండ్రి భూమయ్య శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో వరికోత కోసం దాచిన రూ.60 వేలు కనిపించలేదని, ఈ విషయంపై తన కోడలు కీర్తన (భర్త లేట్ అనిల్)ను ప్రశ్నించగా తనకు తెలియదని చెప్పిందన్నారు.

దీంతో ఇంట్లో మాటా మాటా పెరగడంతో మనస్తాపానికి గురైన కీర్తన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిర్గాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కీర్తన ఆచూకీ తెలిసిన వారు 8712656759 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని SHO కోరారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజల చేత తగిన గుణపాఠం తప్పదు

- కమలాయపల్లి సర్పంచ్ కొలుపుల భాగ్యలక్ష్మి యాదగిరి


చేర్యాల, నవంబర్ 01 (జనంసాక్షి): మండలంలోని కమలాయపల్లి గ్రామ డంపింగ్ యార్డ్ విషయంలో రాజకీయ కక్షతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కమలాయపెల్లి గ్రామ సర్పంచ్ కొలుపుల భాగ్యలక్ష్మి యాదగిరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం నిర్మించిన షెడ్డు గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుండి చీకట్ల కనకయ్య అనే వ్యక్తి తమ స్థలంలోనే నిర్మించారనే నెపంతో చెత్త వేయనివ్వకుండా అనేకసార్లు అడ్డుపడినట్లు తెలిపారు. చెత్త అందులో వేస్తే పురుగుల మందు తాగి చనిపోతానని బెదిరిస్తూ తన భర్త కొలుపుల యాదగిరిపై గతంలో పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి తప్పుడు కేసును కొట్టివేసినట్లు తెలిపారు. వివాదంలో ఉన్న డంపింగ్ షెడ్డు సమస్య పరిష్కారం అయ్యేవరకు తనను వెళ్లొద్దని స్థానిక ఎస్సై సూచించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వంటేరు శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి డంపింగ్ షెడ్డు ఏరియా 340 సర్వే నెంబర్ భూమిని జిల్లా సర్వే అధికారి (డీఐ)తో కొలతలు చేయించడంతో ఖానాపూర్ గ్రామానికి చెందిన భూమిగా నిర్ధారించారు. ఇటీవల షెడ్డుకు సంబంధించిన పరికరాలను తీసుకెళ్లమని తనకు ఫోన్ చేసి చెప్పినప్పటికీ ప్రజల ఆస్తిని కాపాడడం కోసం తాను నిరాకరించినట్లు తెలిపారు. అట్టి వ్యక్తి దౌర్జన్యంగా షెడ్డు రేకులు విప్పి కొంత భాగం ధ్వంసం చేశాడు. ఈ విషయమై బాధ్యత గల సర్పంచిగా వెంటనే స్పందించి అట్టి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి బాల రాజు దృష్టికి తీసుకెళ్లి అనంతరం ఎంపీడీవో, ఎంపీఓ, డీపీఓ, కలెక్టర్ పేషీకి ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. గ్రామంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక తమపై రాజకీయ కక్షలతో గ్రామానికి చెందిన వజ్రోజు శంకరాచారి, సింగపాక బాలయ్య, ఓరుగంటి అంజయ్య, పంజా సూర్య, చీకట్ల కనకయ్య, నీల కిష్టమ్మ అనే వ్యక్తులు రాజకీయ కక్షలతో కొంత మందిని ఉసిగొలిపి తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా వారి పద్ధతులు మార్చుకోకుంటే గ్రామ ప్రజల చేత తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు.



జాతీయ కుటుంబ ప్రయోజన పథకం చెక్కు అందజేత

- రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి - తగుళ్ల కొండల్ యాదవ్

వెల్దండ, నవంబర్ 01 (జనంసాక్షి): వెల్దండ మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన దాసరి కొండల్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన లిచీఖీదీం కింద రూ.20,000/- చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, పోతేపల్లి సర్పంచ్ లితగుళ్ల కొండలు యాదవ్‌లి చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, యువ నాయకులు శారదా బాలయ్య గౌడ్, ఎగిరిశెట్టి శివ, ముంత మల్లేష్, మార్కండేయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణానికి రూ.25 కోట్ల డీడీ ఇచ్చేందుకు సిద్ధం



- ఎమ్మెల్యే ఉత్తర్వులు తెస్తే నా డీడీతో హాస్పిటల్: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి): జడ్చర్లలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, స్థల వివాదాలు, అభివృద్ధి పనుల పై రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. శనివారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన విమర్శలు, సవాళ్లను ఆదివారం జడ్చర్ల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి తీవ్ర స్థాయిలో ఖండించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్మాణంపై ఎమ్మెల్యే తీరును ఎండగడుతూ ఆయన ఒక స్పష్టమైన బహిరంగ సవాల్ విసిరారు. ఈ మేరకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి తామిద్దరం చెరో రూ. 25కోట్ల విలువైన డీడీలు తీసి పట్టణ సీనియర్ సిటిజన్ల వద్ద డిపాజిట్ చేద్దామని ప్రతిపాదించారు. ఎమ్మెల్యే ప్రభుత్వం నుండి హాస్పిటల్ కేటాయింపు జీఓ లేదా అధికారిక ఉత్తర్వులు తీసుకొస్తే తన డీడీ డబ్బులతో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తానని స్పష్టం చేశారు. ఒకవేళ ఎమ్మెల్యే ఆ ఉత్తర్వులు తేలేక పోతే, ఆయన డిపాజిట్ చేసిన డీడీ డబ్బులతో జడ్చర్ల పట్టణాభివృద్ధి పనులు చేపడదామని సవాల్ చేశారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే పదవిని గానీ, అధికారాలను గానీ ఉపయోగించి ఎక్కడా అక్రమంగా ప్రభుత్వ భూములు కొనుగోలు చేయలేదని తేల్చిచెప్పారు. ఎమ్మెల్యే భార్య పొలాన్ని గుంజుకుంటానని తాను ఎక్కడా అనలేదని, ఆయన చెప్పిన రియల్ ఎస్టేట్ లావాదేవీలపై మాత్రమే స్పందించానని స్పష్టం చేశారు. అలాగే వెంకటేశ్వర కాలనీలోని స్థలం కొనుగోలు వ్యవహారంలో రికార్డుల్లో ఎక్కడా ఎండోమెంట్ ల్యాండ్ అని లేదని, క్లియర్ టైటిల్ ఉన్న భూమినే సెంట్ పాల్స్ పాఠశాల యాజమాన్యం కొనుగోలు చేసి నడుపుతోందని వివరణ ఇచ్చారు. ఆసుపత్రి స్థలం గుంతలో ఉందంటూ జరుగుతున్న దుష్ప్రచారంపై స్పందిస్తూ, పక్కనున్న లే అవుట్లతో లెవెల్స్ తీసి అది గుంత అని సీనియర్ సిటిజన్లు, మీడియా మిత్రులు డిక్లేర్ చేస్తే తాను రూ. 25 కోట్ల డీడీ ఇవ్వడంతో పాటు రాజకీయాల నుంచే తప్పుకుంటానని ప్రకటించారు. ఒకవేళ అది గుంత కాదని తేలితే ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి స్థలంపై అనవసర రాజకీయాలు మానుకుని వెంటనే 100 పడకల హాస్పిటల్‌కు అవసరమైన డాక్టర్లను, వైద్య వసతులను తీసుకురావాలని కోరారు. పేద రోగులు మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లకు తిరగకుండా ఇక్కడే పూర్తి వైద్యం అందేలా చూస్తే, జడ్చర్ల ప్రజల శ్రేయస్సు కోసం తాను తగ్గడానికి, ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి
వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు

- అభిమానుల ప్రత్యేక పూజలు



కృష్ణ, నవంబర్ 01(జనంసాక్షి): కృష్ణ మండల కేంద్రంలోని క్షీరలింగేశ్వర మఠంలో ఆదివారం రాష్ట్ర మత్స్య పాడి పరిశ్రమ, క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలిపటేల్ విజయప్ప గౌడ్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆలయంలో పూజలు ప్రత్యేక పూజలు నిర్వహిం కేక్ చేసిన శుభాకాంక్షలు తెలిపారు, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు జై వాకిటి శ్రీహరి నినదాలతో, సభ్యులు, అభిమానులు పాల్గొని ఒకరినొకరు కేక్ తినిపించుకుని టపాసులు కాల్చి సంబరాలు జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అచ్చంపేట చర్చిలో
ఘనంగా వరల్డ్ సండే స్కూల్ డే



అచ్చంపేట, నవంబర్ 1 (జనంసాక్షి): వరల్డ్ సండే స్కూల్ డే సందర్భంగా అచ్చంపేట చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులు వివిధ బైబిల్ పాత్రల వేషధారణలతో ఆకట్టుకున్నారు. యేసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, సేవాభావం, మానవత్వం వంటి విలువలను చిన్నారులకు తెలియజేస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ జయన్న, సంఘ పెద్దలు జేమ్స్, కరుణాకర్, భాస్కర్, ప్రభాకర్, అబ్నాలోము, చంద్రకాంత్, సండే స్కూల్ ఉపాధ్యాయులు, మహిళలు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను అభినందించారు.

ఉమామహేశ్వర ఆలయంలో అయ్యప్ప మాలధారణ.. 16 మంది భక్తులు దీక్ష స్వీకారం

- గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో కార్యక్రమం



తెలకపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి): అయ్యప్ప స్వామి శరణు ఘోషతో ఉమామహేశ్వర ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తులు ఆదివారం ఉదయం అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో భక్తిప్రపత్తులతో మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురుస్వాములు మధు, రాజాచారి, గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 16 మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరించి స్వామివారి దీక్షను స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప నామస్మరణ, భక్తుల శరణుఘోషతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.
ఈ సందర్భంగా మాలధారణ చేసిన స్వాములు గురుస్వాముల మార్గదర్శకత్వంలో నియమనిష్ఠలతో మండల దీక్షను కొనసాగించి, అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

కానుకుంటలో బీజేపీలోకి యువత చేరికలు



గుమ్మడిదల, నవంబర్ 1 (జనంసాక్షి): కానుకుంట గ్రామంలో భారతీయ జనతా పార్టీ బలోపేతం దిశగా పలువురు యువకులు పార్టీలో చేరారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా జంగిటి రత్నం, పెద్దోళ్ల నాగరాజు, బోయిని నరేందర్, జుర్రు లక్ష్మణ్, జుర్రు మణికంఠ, సయ్యద్ జావీద్, బోయిని సురేందర్, దాచారం రాజు, రావుల రాము, నల్తూరు కుమార్ తదితరులు బీజేపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై బీజేపీలో చేరినట్లు యువకులు తెలిపారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మండల ప్రధాన కార్యదర్శి సోమ్మోల్ల యాదగిరి, బూత్ అధ్యక్షుడు తోటపల్లి సాయిరాం రెడ్డి, సలహాదారు జుర్రు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల ఎంఈఓగా జగదీష్ కుమార్



జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి): జడ్చర్ల మండల విద్యాధికారి (ఎంఈఓ)గా వలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.జగదీష్ కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఆయన ఈ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యా శాఖ సిబ్బంది ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీష్ కుమార్ మాట్లా డుతూ.. జడ్చర్ల మండలంలో విద్యా ప్రమాణాల పెంపు నకు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరి సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలు


చిన్నశంకరంపేట, నవంబర్ 1 (జనంసాక్షి): చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచా పేల్చి ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.
ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దేశంలోనే అతి చిన్న వయసు కలిగిన ఎమ్మెల్యేలలో ఒకరని పేర్కొన్నారు. యువ నాయకుడిగా ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మాజీ అధ్యక్షుడు సాన సత్యనారాయణ మాట్లాడుతూ.. యువ ఎమ్మెల్యే రోహిత్ రావు తన తండ్రి మైనంపల్లి హనుమంతరావు అడుగుజాడల్లో నడుస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలతో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సర్పంచులు పుల్లారావు, ప్రవీణ్ కుమార్, అశోక్ నాయక్, చిన్నశంకరంపేట మాజీ



ఉపసర్పంచ్ జీవన్, కాంగ్రెస్ మండల కోశాధికారి తిగుళ్ల భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు రాజాసింగ్, యాదగిరి, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి నిరసన కార్యక్రమానికి కోహిర్ కాంగ్రెస్ నేత ముజఫర్ హుస్సేన్ హాజరు

- ఢిల్లీ రాంలీలా మైదానంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు పయనం
- తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఏఐసీసీ నాయకులతో భేటీ
- ఢిల్లీ నిరసన కార్యక్రమానికి కోహిర్ కాంగ్రెస్ నేత ముజఫర్ హుస్సేన్



కోహిర్, నవంబర్ 1 (జనంసాక్షి): ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కోహిర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు ఏఐసీసీ ముఖ్య నాయకులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి చేపడుతున్న కార్యక్రమాలు, దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతం తదితర అంశాలపై నాయకులతో చర్చించినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలిపారు.కోహిర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముజఫర్ హుస్సేన్ ఢిల్లీ పర్యటన చేపట్టడం, రాష్ట్ర స్థాయి మరియు జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకులను కలవడం స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తిని కలిగించింది.

క్రీడలు మైత్రిని, ఐక్యతను పెంపొందిస్తాయి: మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి



జడ్చర్ల, నవంబర్ 01(జనంసాక్షి): పట్టణంలోని స్థానిక డాక్టర్ బి.ఆర్.ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జడ్చర్ల ఫోటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలను మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ వృత్తిపరమైన బాధ్యతలు, పని ఒత్తిడితో నిత్యం బిజీగా గడిపే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. క్రీడలు ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, క్రీడాకారుల మధ్య మైత్రిని, ఐక్యతను మరియు సోదర భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులకు, పోటీల్లో పాల్గొంటున్న వివిధ జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ - ఓటు బచావో, దేశ్ బచావో



చిన్న శంకరంపేట్, నవంబర్ 1 (జనంసాక్షి): ఇండియా కూటమి పిలుపు మేరకు దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన లిఓటు బచావో – దేశ్ బచావోలి నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, ఓటు చోరీ ఆరోపణలను ఖండిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరియు ప్రతి ఓటు విలువను కాపాడేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మెదక్ శాసనసభ్యులు గౌరవనీయులు లిడాక్టర్ మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే శ్రీ మైనం పల్లి హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు మా మద్దతు తెలియజేయడం జరిగింది.

ఓటు మన హక్కు – ప్రజాస్వామ్యం మన బాధ్యత!

ఓటు బచావో – దేశ్ బచావో!

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం – రాజ్యాంగ విలువలను నిలబెట్టుకుందాం!.. ఈ కార్యక్రమంలో చిన్న శంకరంపేట మండలంలో నుండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ నాయక్, ఉపాధ్యక్షులు సింగమొల్ల ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి శంభుని రాజ్ కుమార్ కాం గ్రెస్ నాయకులు తాజా మాజీ ఎంపిటిసి ఉప్పలపు శివకుమార్, యువ నాయకులు పొట్టి శివరాజ్ ముదిరాజ్, శేరి స్వామిలి పాల్గొన్నారు.

ఢిల్లీ కాంగ్రెస్ నిరసనలో పాల్గొన్న మంత్రి



సంగారెడ్డి, నవంబర్ 1 (జనంసాక్షి):
కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గానికి చెందిన నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. అంజయ్య నిరసనలో పాల్గొన్నారు. వారితోపాటు మునిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రామ్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రసూల్ పటేల్, మక్సుద్ పటేల్ , వట్‌పల్లి మండల అధ్యక్షుడు వజనాల విశ్వాస్, అందోల్ మండల అధ్యక్షుడు గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షుడు లింగన్నగారి సతీష్ కుమార్, చౌటకూర్ మండల అధ్యక్షుడు బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి, రాయికోడ్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల కేదారినాథ్ పాటిల్, అందోల్-జోగిపేట పట్టణ అధ్యక్షుడు డి.జి. వెంకటేశం తదితరులు ఉన్నారు.

ఘనంగా మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు





మక్తల్, నవంబర్ 1 (జనంసాక్షి): మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలను మక్తల్ నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పేదలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సంగంబండ బండరాయి వద్ద రైతులు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 150 పడకల ఆసుపత్రి, సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, విద్యా, వైద్య రంగాల్లో మంత్రి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తారా కళాశాలలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

- **నవంబర్ 2 నుంచి 6 వరకు ధ్రువపత్రాల సమర్పణ.. 7న ప్రవేశాలు..**

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 1 (జనంసాక్షి):
తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), సంగారెడ్డిలో 2026-27 విద్యా సంవత్సరానికి పదిపీజీ కోర్సుల్లో మిగిలిన 378 ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు, సంబంధిత ధ్రువపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 7న ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కళాశాలలో ఎం.ఏ. ఇంగ్లిష్‌లో 48, తెలుగు 32, రాజకీయ శాస్త్రంలో 38, ఎం.కాం.లో 39, ఎం.ఎస్సీ వృక్షశాస్త్రంలో 37, సేంద్రీయ రసాయన శాస్త్రంలో 7, కంప్యూటర్ సైన్స్‌లో 51, గణితశాస్త్రంలో 55, భౌతికశాస్త్రంలో 54, జంతుశాస్త్రంలో 17 ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

తెలంగాణ పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష-2026లో అర్హత సాధించినవారితో పాటు, అర్హత సాధించని, పరీక్షకు హాజరుకాని అభ్యర్థులు సైతం సంబంధిత కోర్సుల అర్హత నిబంధనలకు లోబడి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు నవంబర్ 2 నుంచి 6వ తేదీ వరకు కళాశాలలో సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి, నవంబర్ 7న నిర్వహించే ప్రవేశాల ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, డిగ్రీ తాత్కాలిక ధ్రువపత్రం, సమగ్ర మార్కుల మెమో, చదివిన విద్యాసంస్థల ధ్రువపత్రాలు, బదిలీ ధ్రువపత్రంతో పాటు వర్తించే ఇతర ధ్రువ పత్రాల అసలు ప్రతులు, వాటి రెండు జిరాక్స్ సెట్లను తీసుకురావాలని తెలిపారు.

ప్రవేశ సమయంలో రూ.2,100 ప్రాసెసింగ్ రుసుము చెల్లించాల్సి ఉంటుందని, స్పాట్ ప్రవేశాల ద్వారా చేరిన విద్యార్థులకు ఫీజు తిరిగి చెల్లింపు పథకం వర్తించదని స్పష్టం చేశారు.

మరిన్ని వివరాలకు 9908993551 నంబరులో రాజును సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

రేషన్ షాప్‌ల ద్వారా 14 రకాల వస్తువులు ఇవ్వాలి...

- **ప్రతి ఒక్కరికి 12 కేజీల ఉచిత బియ్యం అందించాలి**

అమరచింత, నవంబర్ 1 (జనంసాక్షి): తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘశీ వనపర్తి జిల్లా అధ్యక్షులు యస్ అజయ్.డీమాండ్ అమరచిశీతలో ఆదివారం నాడు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతు ప్రస్తుతఎల్ నీనో ప్రభావం వర్ష బావ కరువు పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరినీ ఆదుకోవాల్సిన ఆవశ్యకత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉన్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలను బ్లాక్ గా వ్యాపారస్తులు విచ్చలవిడిగా ధరలను పెంచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాక్లో బియ్యం ఇష్టానుసారంగా అమ్ముతున్న రైస్ మిల్లులు వ్యాపారస్తులపై ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు దాడులు నిర్వహించి పెరుగుతున్న నిత్యవసరవస్తువులధరలను అదుపు చేయాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. కిరాణా షాపులలో ధరల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే ఒక్క వ్యక్తి బియ్యంను 6 కేజీల నుండి 12 కేజీలకు పెంచాలని కోరారు. బియ్యంతో పాటు 14 రకాల నిత్యవసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా సబ్సిడీతో ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.

పక్క ఆంధ్రప్రదేశ్లో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీకి వస్తువులు అందిస్తున్నప్పటికీ తెలంగాణలో కూడా అటువంటి అమలు దిశగా చర్యలు తీసుకోవాలి రేషన్ బియ్యం 12 కేజీల తో పాటు. నూనె పప్పు చక్కెర.



ఉల్లిగడ్డలు. గోధుమపిండి గోధుమలు. జొన్నలు జొన్న పిండి. కారంపొడి చింతపండు పసుపు.టీ పొడి సబ్బులు బెల్లం లాంటి తదితర వస్తువులను సబ్సిడీపై అందించాలని కోరారు. రేషన్ షాపులను సూపర్ మార్కెట్ల లాగా నిత్యవసర వస్తువులు ప్రజలకు అందుబాటులో పెట్టి సబ్సిడీపై నిత్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు కే శంకర్ బుచ్చన్న శ్రీనివాసులు.యాదయ్య ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్ట ఆలయ వివాదంపై పీఏసీఎస్ చైర్మన్ స్పష్టత



జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి): బాదేపల్లి పెద్దగుట్ట శ్రీ రంగనాయక స్వామి ఆలయ వేదికగా స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిపై జరుగుతున్న ప్రచారాన్ని ఆదివారం పీఏసీఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ ఖండించారు. ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీక అని, దేవుడి సన్నిధిలో రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ధార్మిక కార్యక్రమాలు సాంప్రదాయం, పండితుల సలహాలు, ఎండోమెంట్ శాఖ అనుమతులతోనే జరగాలని స్పష్టం చేశారు. అధికారిక హోదా లేని రామిరెడ్డి నిబంధనలు విస్మరించి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గోపురం పూర్తి కాకుండా ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం అరిష్టమని అర్చకులు తెలిపారని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రమేయం లేదని, ఆయన కుటుంబానికి ఆలయాలు నిర్మించిన చరిత్ర ఉందని తెలిపారు. దైవ సన్నిధిలో రాజకీయ కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

కార్మిక నేత చెట్టబోయిన యాదగిరి మృతి

- **యూనియన్ నాయకుల నివాళి**

సిద్దిపేట, నవంబర్ 1 (జనంసాక్షి): రైస్ అండ్ పారా బాయిల్డ్ మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చెట్ట బోయిన యాదగిరి (50) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం హనుమాన్ నగర్‌లో నిర్వహించిన అంత్యక్రియల్లో యూనియన్ నాయకులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యాదగిరి రెండు దశాబ్దాలుగా కార్మిక ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారని, అసంఘటిత కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ, న్యూడెమోక్రసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష: డిఈఓ గోవిందరాజ్

నారాయణపేట, నవంబర్ 1(జనంసాక్షి): నారాయణపేట జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాల ర్షిప్ పరీక్ష ప్రశాంతంగా జరి గిందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవింద్ రాజ్ తెలిపారు.జిల్లాలో మొత్తం నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని చీఫ్ సూపరిండెంట్ 4గురు, డిపార్ట్మెంటల్ ఆఫీ సర్స్ 4గురు మొత్తం ఇన్వి జిలేటర్ 40 మంది స్పెషల్ స్క్వాడ్ ఒకరు పాల్గొన్నార ని తెలిపారు.ఈ పరీక్ష నారాయణపేట గురుకుల పాఠశాలలో మొత్తం విద్యా ర్థుల సంఖ్య 220కు గానూ పరీక్షకు210 మంది హాజ రయ్యారు.గురుకుల పాఠ శాల బిలో మొత్తం విద్యా ర్థుల సంఖ్య 219కు గానూ పరీక్షకు హాజరైన విద్యార్థు లు 211మంది హాజర య్యారు.ప్రభుత్వా బాలికల పాఠశాలలోమొత్తం విద్యా ర్థుల సంఖ్య 209కు గానూ పరీక్షకు హాజరైన విద్యా ర్థులు200 మంది హాజరై న్నారని అలాగే ప్రభుత్వ గ్రౌండ్ స్కూల్ లోమొత్తం విద్యార్థుల సంఖ్య 211గానూ పరీక్షకు హాజ రైన విద్యార్థులు199 మంది పరీక్షలు రాశారని వివరించారు. నాలుగు సెంటర్లలో మొత్తం విద్యార్థుల సంఖ్య 859 గాను



పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య 820 మంది పరిక్ష రాయగా 39 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. పరీక్షలను నిర్వాణ అధికారి శశికుమార్ పర్యవేక్షించారు.

బాధిత కుటుంబాలకు
వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శ



నంగునూరు, నవంబర్ 1 (జనంసాక్షి): మండలంలోని ముండ్రాయి, రాంపూర్ గ్రామాలలో మృతి చెందిన బాధిత కుటుంబాలను వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శించి, తమ ఉదారతను చాటుకున్నారు.ముండ్రాయి గ్రామానికి చెందిన రాగుల సాయిలు, రాంపూర్ గ్రామానికి చెందిన అక్కోజు ఈశ్వరయ్య ఇటీవల మరణించడంతో వారి నివాసాలకు వెళ్లిన రాజేశ్వర్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5,000 ల చొప్పున మొత్తం రూ.10,000 అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ ఆర్ టీం సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు,

అట్టహాసంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుక



పాపన్నపేట, నవంబర్ 1(జనంసాక్షి): మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకను ఆదివారం పాపన్నపేట మండల కేంద్రంలో హస్తం శ్రేణులు అట్టహాసంగా నిర్వహించారు. ప్రధాన చౌరస్తా సమీపన కేకుకట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షు డు వెంకటేశం,సర్పంచులు పావని, రాణెమ్మ, స్వప్న, విజయదుర్గా, సుశీల,అంజయ్య, శ్రీనివాస్, నాయకులు గోవింద్ నాయక్, ఖలీమ్, కిష్టయ్య,సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తిశేషులు చల్లారం లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించిన పలువురు ప్రముఖులు





నంగునూరు, నవంబర్ 1(జనంసాక్షి): నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామా నికి చెందిన చల్లారం కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం ప్రెసిడెంట్ చల్లారం శ్రీనివాస్ రెడ్డి గార్ల మాతృమూర్తి కీర్తిశేషులు చల్లారం లక్ష్మి గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణిం చడం జరిగింది. విషయం తెలుసుకున్న పలు వురు ప్రముఖులు ఆదివారం రోజు కరీంనగర్ డైరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వరరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి, అను ముల రాజా వర్ధన్ రెడ్డి, వారి మిత్రబృందం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదిన వేడుకలు



మెదక్ నవంబర్ 01 (జనంసాక్షి): హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండారం కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు టపాకాయలు బైకు ర్యాలీ నిర్వహించారు అనంతరం అనంతరం భారీ కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుంటూ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం వారు మాట్లాడుతూ యంగ్ డైనమిక్ ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి ప్రధాన దాత భారత దేశంలోనే చిన్న వయసులో మెదక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మైనంపల్లి రోహిత్ రావు ఆయు ఆరోగ్యాలతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని, వారు ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాదుకు రాగానే ఆయనకు మంత్రి పదవి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంకనేని బాలకిషన్ రావు సేరి మహేందర్ రెడ్డి లస్కర్ శ్రీనివాస్ నోముల శ్రీకాంత్ చిట్యాల శ్రీనివాస్ దమ్ము వెంకటేష్ గౌడ్ యూత్ నాయకుడు రిజ్వాన్ కృష్ణా గౌడ్ ప్రవీణ్ కుమార్ సర్పంచు లు అక్బర్ దశరథం చామంతుల సత్యనారా యణ చిన్న సాయిలు లింగాల సంతోష్ వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి కాలనీ వాసుల ఆర్థిక సహాయం



కల్వకుర్తి,నవంబర్01(జనంసాక్షి): కల్వకుర్తి పట్టణంలోని కుర్మిద్ద రోడ్డులో సాయిబాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలోని సాయికృష్ణ కాలనీకి చెందిన మోటం ఆంజనేయులు (55) రెండు రోజుల క్రితంహైదరాబాద్‌కువెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న కాలనీ వాసులు మానవతా దృక్పథంతో స్పందించి, మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతు బాధ్యతగా రూ.43 వేల ఆర్థిక సహాయాన్ని సేకరించి ఆదివారం మృతుడి భార్యకు అందజేశారు. భవిష్యత్తులోనూ కుటుం బానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఛలో ఢిల్లీలో ఆత్మకూర్ కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూర్, నవంబర్ 1 (జనంసాక్షి): ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలోని అంబేద్కర్ భవన్ వద్ద నిర్వహించిన 'ఛలో ఢిల్లీ–ఓట్ బచావో, దేశ్ బచావో' నిరసనలో ఆత్మకూర్ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటం కొన సాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రె స్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు



ఆత్మకూర్, నవంబరు 1 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు గౌరవ శ్రీ డాక్టర్ శ్రీహరి జన్మదిన సందర్భంగా ఆదివారం ఆత్మకూర్ ప్రభుత్వ ఆసు పత్రిలో కాంగ్రెస్ నాయకులు రోగులకు పండ్లు మరియు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి శ్రీహరి ఆయు ఆరోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎం.డి. రహమతుల్లా, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, ఆత్మకూర్ టౌన్ అధ్యక్షులు ఈర్లదిన్నె శ్రీనివాసులు, ఆత్మకూరు మాజీ మండల అధ్యక్షులు రాయచూర్ పరమేష్, 1వ వార్డ్ కౌన్సిలర్ కోట్ల తిరుపతి, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు కడియాల శ్రీనివాసులు యాదవ్, గణేష్ ముదిరాజ్, అక్షర దామోదర్, గాలి పంపు శీను, బుచ్చన్న, సాయి వెంకట రాఘవేంద్ర, వెంకట్ రెడ్డి, కర్ణలాల్, బోయ రాజు, షాలు, ఆరెపల్లి శ్రీను, అన్వర్ పాషా, గడ్డం శ్రీకాంత్, కావలి రవి, నరసింహ ముదిరాజ్, రవికుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు,

గద్వాలలో డ్రిప్ పైపుల రీసైక్లింగ్ పరిశ్రమకు భూమిపూజ



గద్వాల, నవంబర్ 01(జనంసాక్షి): గద్వాల జెటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయనున్న డ్రిప్ పైపుల రీసైక్లింగ్ పరిశ్రమకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. పాత డ్రిప్ పైపులను రీసైక్లింగ్ చేసి కొత్త పైపులు తయారు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. రైతులు పాత పైపులను పరిశ్రమకు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.
కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

మోట్లంపల్లిలో నూతన మహర్షి వాల్మీకి ఆలయ భూమి పూజ



ఆత్మకూర్, నవంబర్ 01(జనంసాక్షి): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మోట్లంపల్లి గ్రామంలో మహర్షి వాల్మీకి నూతన దేవాలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ కౌన్సిలర్, వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర నాయకులు, దీ=నా నేత మండ్ల రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అర్చకుల చేత శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగన్న, గ్రామ ఉప సర్పంచ్ రాములు, గడ్డం గోవిందు, భగవాన్, రంగారెడ్డి, ఘటన నాగేష్, రాజు ఈదన్న, గుంటిపల్లి గోవిందు, శాంతన్న, కురుమూర్తి, అంజలన్న, శ్రీను, కావలి రాజు, నాగరాజ్, ఆంజనేయులు, ఎర్రన్న, రామాంజనేయులు, మన్యం, గ్రామ వాల్మీకి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పలువురు పాల్గొన్నారు.

జమ్లా తండాలో పేదల భూముల కబ్జా
కలకలం స్థానికుల ఆందోళన

సిర్గాపూర్, నవంబర్ 1 (జనంసాక్షి): సిర్గాపూర్ మండలం జమ్లా తండాలో పేదల వ్యవసాయ భూములను బడా నేతల ప్రోద్బలంతో కొందరు కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా పొలాలకు వెళ్లే దారిని కూడా కబ్జా చేసి సోలార్ ప్రాజెక్ట్ కాంపౌండ్ కట్టారని ఆరోపించారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో.. పాలిచ్చే గేదె మృతి



మహమ్మదాబాద్, నవంబర్ 01(జనంసాక్షి):
విద్యుత్ షాక్‌కు గురై పాలిచ్చే గేదె మృతి చెందిన విషాద ఘటన మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన, తిరుమలి శ్రీనివాసులు గేదెల పెంపకంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో రోజుకు ఐదు లీటర్ల పాలు ఇచ్చే గేదె ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడింది.సుమారు రూ.1.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన గేదె మృతి చెందడంతో రైతు శ్రీనివాసులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.పాడి పశువే కుటుంబ పోషణకు ప్రధాన ఆధారంగా ఉండటంతో ఒక్కసారిగా జీవనోపాధి దెబ్బతిన్నదని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి పశువును కోల్పోయిన తనకు ఆర్థిక పరిహారం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నారు.

హమాలీ కార్మికులకు
రూ.42 వేల కనీస వేతనం ఇవ్వాలి



గద్వాల, నవంబర్ 1 (జనంసాక్షి):
హమాలీ కార్మికులకు నెలకు రూ.42 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గద్వాలలో నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ఉచిత విద్య, వైద్యం, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రమాద బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడి చేపట్టి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఆత్మకూర్‌లో
మహిళ అదృశ్యం - కేసు నమోదు



ఆత్మకూర్, అక్టోబర్ 31 (జనంసాక్షి):
ఆత్మకూర్ మండలం బీసీ కాలనీకి చెందిన యాస్మీన్ బేగం, వయసు 45 సంవత్సరాలు అనే మహిళ అదృశ్యమైందని ఎస్ఐ జయన్న తెలిపారు.
తేది 30.10.2026 రోజున ఉదయం 11:30 గంటలకు ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ఉమెన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.ఈ మహిళ ఎక్కడైనా కనిపించినా లేదా ఆమెకు సంబంధించిన సమాచారం తెలిసినా 8712670631 సెల్ నెంబర్ కు వెంటనే తమకు సమాచారం అందించాలని ఆత్మకూర్ ఎస్ఐ జయన్న విజ్ఞప్తి చేశారు,

మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు!

- **బీజేపీ, హిందూవాహిని చొరవతో బాధిత కుటుంబానికి అండ.. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**





వనపర్తి, నవంబర్ 1 (జనంసాక్షి): పట్టణంలోని మర్రికుంట ప్రాంతంలో 16 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దోపిడీ జరిగిందన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం, రహీం (42) అనే వ్యక్తి తనకు ఇప్పటికే వివాహమై నలుగురు పిల్లలు ఉన్నప్పటికీ, సుమారు రెండేళ్లుగా మైనర్ బాలికను మాయమాటలతో లోబరుచుకుని లైంగికంగా దోపిడీ చేశాడని, బాలిక గర్భం దాల్చడానికి కారణమయ్యాడని ఆరోపించారు. అంతేకాకుండా బాధిత కుటుంబాన్ని బెదిరించినట్లు కూడా కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.
ఈ ఘటనపై సమాచారం అందుకున్న బీజేపీ నాయకులు, హిందూవాహిని కార్యకర్తలు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులకు ధైర్యం కల్పిస్తూ, బాలికకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయపోరాటం చేశారు. బీజేపీ నాయకులు, హిందూవాహిని కార్యకర్తల చొరవతో పోలీసులు స్పందించి ఆరోపణలు ఎదుర్కొంటున్న రహీంను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై విచారణ చేపట్టి, వర్తించే చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించాలి...

మైనర్ బాలికలపై జరిగే లైంగిక దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.
ఈ కేసులో పోక్సో (POCSO) చట్టంతో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు పూర్తి పోలీసు రక్షణ, అవసరమైన వైద్య సహాయం, మానసిక భరోసా కల్పించాలని కోరారు. అలాగే బాధిత కుటుంబాన్ని బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రత్యేకంగా విచారణ జరపాలని, బాలిక గోప్యతను కాపాడుతూ కుటుంబానికి అన్ని విధాలా భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆడబిడ్డల భద్రత విషయంలో రాజీ లేదు...

బాధిత బాలికకు న్యాయం జరిగే వరకు, చట్టపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆమె కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఇది రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న పోరాటం కాదని, ఒక ఆడబిడ్డకు న్యాయం జరగాలనే సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతున్న ఉద్యమమని పేర్కొన్నారు.

కేతకీ సంగమేశ్వరుడికి పీఠాధిపతుల అభిషేకాలు..



ఝరాసంగం, నవంబర్ 1 (జనంసాక్షి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం సద్ధర్మసింహాసన మహాసంస్థాన పీఠం కర్నాటక, మధ్యప్రదేశ్ ఉజ్జయిని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ1008 జగద్గురు సిద్దలింగ రాజదేశీకేంద్ర శివాచార్య భగవద్పాద మహాస్వామీజీ, కామారెడ్డి జిల్లా బీచ్కుంద మఠాధిపతి సోమలింగ శివాచార్య మహారాజ్, బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి వైరాఘ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, వీరేశ్వర శివాచార్య హీరేమఠ్ ధనాసిరి మఠాధిపతితో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వెలసిన శివలింగానికి అభిషేకం నిర్వహించి పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అలయ ఈఓ శివరుద్రప్ప, పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్ శాలువా పూలమాలతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, పాలక మండలి సభ్యులు ఉన్నారు.



శివలింగం వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు?

- **గుర్తుతెలియని వ్యక్తులపై వెల్దండ పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు**





వెల్దండ, నవంబర్ 01 (జనంసాక్షి):
వెల్దండ మండలంలోని రాగాయపల్లి గ్రామపంచాయతీ పరిధి నాగరావుపల్లి తండాలో గుప్తనిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు తవ్వకాలు జరిపినట్లు వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఈ నెల 29న ఉదయం తన పొలానికి వెళ్లిన ఇస్లావత్ శీను.. చిన్న రాళ్లగుట్టపై ఉన్న శివలింగం పక్కన సుమారు ఐదు అడుగుల లోతులో గుంత తవ్వి తిరిగి పూడ్చిన ఆనవాళ్లను గుర్తించారు.ఈ ఘటన ఈ నెల 28న రాత్రి జరిగి ఉంటుందని అనుమానిస్తూ గ్రామ పెద్దలతో చర్చించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్దండ ఎస్సై గంగిరెడ్డి యుగేందర్ రెడ్డి తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం తెలంగాణ బీపీటీ బియ్యం కిలో రూ.66, సోనా బియ్యం కిలో రూ.74, శ్రీరామ్ గోల్డ్ బియ్యం కిలో రూ.79కు మించి విక్రయించరాదని అయన స్పష్టం చేశారు.రైస్ మిల్లర్లు, ట్రేడర్లు, హోల్‌సేల్ డిపో నిర్వాహకులు, చిల్లర వ్యాపారులు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన బియ్యం న్యాయమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులందరూ జిల్లా యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలని అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య కోరారు.

శ్రీ పరశురామ
ఆలయ నిర్మాణానికి భూమిపూజ



మల్దకల్, నవంబర్ 1(జనంసాక్షి): మండలం బిజ్వారం గ్రామంలో శ్రీ పరశురామస్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు.గ్రామానికి చెందిన వై. శ్రీనివాస్ రెడ్డి గ్రామ పెద్దల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వై. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో దేవాలయ నిర్మాణం చేపట్టడం దేవాలయాలు ఆధ్యాత్మికతకు, భక్తి భావానికి ప్రతీకలని పేర్కొన్నారు.గ్రామ ప్రజలందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్క రూ ఐకమత్యంతో ముందుకు వచ్చి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్రెన్న, గ్రామస్తులుడి. సత్యారెడ్డి, రాగిమాన్ తిమ్మారెడ్డి, సోమేశ్వర్ రెడ్డి, కొంకల గోకరన్న,మెకాని గోవిందు, మాజీ సర్పంచ్ తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు



అమరచింత, నవంబర్ 1 (జనంసాక్షి):
రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జన్మదినం సందర్భంగా అమరచింత మండలం సింగంపేట గ్రామంలోని అడవి ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
మంత్రి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్ సూచన మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు.. ప్రమాదకరంగా మారిన ప్రయాణం!



- మలుపుల వద్ద కనిపించని ఎదురుగా వచ్చే వాహనాలు..
- ప్రమాదం పొంచి ఉందంటున్న స్థానికులు
- అధికారులు స్పందించి రహదారి వెంబడి పాదలు తొలగించాలని ప్రజల విజ్ఞప్తి

తెలకపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి): మండల కేంద్రం నుంచి కల్వకుర్తి వెళ్లే ప్రధాన రహదారి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతోంది. రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి విస్తరించడంతో రహదారి ఇరుకుగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో రహదారి అంచులు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రహదారిపై ఉన్న ప్రమాదకరమైన మలుపుల వద్ద పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడం కష్టంగా మారుతోంది. దీనికి తోడు కొన్ని చోట్ల హెచ్చరిక బోర్డులు, దిశా సూచికలు లేకపోవడం ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే అనుబంధ రహదారులపైనా ఇదే పరిస్థితి కనిపిస్తోందని ప్రజలు పేర్కొంటున్నారు. రహదారుల నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే రహదారి నిర్వహణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బీచుపల్లిలో
జేడీ పద్మజారాణి ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి, నవంబర్ 1 (జనంసాక్షి): బీచుపల్లి ఆలయాన్ని సందర్శించిన జాయింట్ డైరెక్టర్ పద్మజారాణికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్తీక మాసం సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలకులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ పంచాయతీ శాఖ ఉన్న తాధికారి పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మల్కాపూర్‌లో 425వ వారం స్వచ్ఛభారత్



తూప్రాన్, నవంబర్ 1 (జనంసాక్షి): తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 425వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్మశానవాటికలో నిర్వహించారు. డీఎల్పీఓ సాయిబాబా, ఎంపీఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎల్పీఓ మాట్లాడుతూ మల్కాపూర్‌ను జాతీయస్థాయిలో ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు యువత, గ్రామస్తులు నిరంతరం స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో
ప్రతిభ చాటిన నిడ్జింత విద్యార్థులు



కొత్తపల్లి, నవంబర్ 1 (జనంసాక్షి): నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్ట్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయ్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కరాటే వల్ల శారీరక దారుఢ్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే ఫౌండర్ సలాం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అంబ్రేష్, కరాటే మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ విద్యార్థులకు బస్సు సౌకర్యం



కొండపాక, నవంబర్ 1 (జనంసాక్షి): గజ్వేల్‌లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే కొండపాక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మాజీ జెడ్పీటీసీ అనంతుల అశ్విని ప్రశాంత్ బస్సు సౌకర్యం కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కోరిన వెంటనే స్పందించి ప్రయాణ ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్య ఎంతో ముఖ్యమని, విద్యాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ప్రశాంత్ తెలిపారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ఓట్‌చోరీ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీపీ బృందం



పెద్దకొత్తపల్లి, నవంబర్ 1 (జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓట్ చోరీ' ర్యాలీలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి మండల మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకుని ర్యాలీలో భాగస్వాములయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపుకు స్పందించి వివిధ రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చాయని అన్నారు.

రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పార్టీ ఐక్యతను చాటారని తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం ఉండాలనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు తమ సంఘీభావాన్ని ప్రకటించారని అన్నారు.

ఈ ర్యాలీలో కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఈక్వలిటీ రన్‌లో మెరిసిన జడ్చర్ల రన్నర్స్

- ఆరోగ్యమే లక్ష్యంగా పరుగులు



జడ్చర్ల, నవంబర్ 1 (జనంసాక్షి): ఆరోగ్య పరిరక్షణ, శారీరక దృఢత్వమే లక్ష్యంగా ఆదివారం ముచ్చింతల్‌లో నిర్వహించిన ఈక్వాలిటీ రన్ రెండో ఎడిషన్‌లో జడ్చర్ల రన్నర్స్ ప్రతిభ చాటారు. 21కే, 10కే, 5కే విభాగాల్లో నిర్వహించిన పరుగులో మొత్తం 3,000 మందికి పైగా పాల్గొనగా, జడ్చర్ల నుంచి సుమారు 150 మంది రన్నర్లు హాజరయ్యారు. పోటీల్లో జడ్చర్లకు చెందిన రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ రామకృష్ణ 10కే పరుగును 75 నిమిషాల్లో పూర్తి చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జడ్చర్ల రన్నర్లను ప్రోత్సహించడంలో రిటైర్డ్ పీడీ రామకృష్ణ, గోపాల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పరుగులో 20 ఏళ్ల యువకుల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు, విద్యార్థులు, రిపోర్టర్లు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నర్లకు శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి మెడల్స్ అందజేశారు. రన్నర్లకు టీ-షర్టులు, మెడల్స్, అల్పాహారం అందించారు. రోజువారీ పరుగుతో జడ్చర్ల రన్నర్స్ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే మూడో ఎడిషన్‌లో జడ్చర్ల నుంచి 500 మందికి పైగా పాల్గొనేలా చూడాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఈక్వలిటీ రన్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు.

నాగర్‌కర్నూల్ టిఆర్‌పి జిల్లా కార్యదర్శిగా తోకల రాము యాదవ్



పెద్దకొత్తపల్లి, నవంబర్ 1(జనంసాక్షి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శిగా పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన తోకల రాము యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా తోకల రాము యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు, రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించి రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న చూపుతున్న మార్గంలో నడుస్తూ పనిచేస్తానని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామ గ్రామాన పార్టీ జెండాను తీసుకెళ్లి బీసీల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యతపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తానని తెలిపారు. బీసీ వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానన్నారు.

తీన్మార్ మల్లన్న అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాలో పార్టీకి బలమైన పునాది వేసేందుకు నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా, నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిస్తానని తోకల రాము యాదవ్ స్పష్టం చేశారు. చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన రాముకు జిల్లా స్థాయి బాధ్యతలు దక్కడంపై స్థానికంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రక్షణ సేనలో
నూతన కార్యవర్గ నియామకాలు

నూతన నాయకులకు దయాకర్ రెడ్డి ఘన సన్మానం



సంగారెడ్డి, నవంబర్ 1 (జనంసాక్షి): తెలంగాణ రక్షణ సేన సంగారెడ్డి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం నూతన కార్యవర్గాన్ని నియమించారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం నియామక పత్రాలు అందజేశారు.

సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడిగా చంద్రిక కరుణాకర్, సదాశివపేట పట్టణ అధ్యక్షుడిగా గౌరెడ్డి మనోజ్ రెడ్డి నియమితులయ్యారు.

ముస్లిం విభాగం అధ్యక్షుడిగా మహమ్మద్ ముజాహిద్, న్యాయ రక్షణ విభాగం అధ్యక్షురాలిగా ప్రియా రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా మదన్మోళ్ల రాహుల్, జర్నలిస్ట్ విభాగం అధ్యక్షుడిగా సందీప్ కుమార్, ఐటీ కన్వీనర్‌గా సాయికాంత్ గౌడ్, దళిత విభాగం కన్వీనర్‌గా మన్నె నవీన్, సోషల్ మీడియా బాధ్యుడిగా బి.వేణు, ట్రేడ్ అండ్ కామర్స్ బాధ్యుడిగా ఎన్. కృష్ణమోహన్ నియమితులయ్యారు.

అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి కలబుర్గ్ దయాకర్ రెడ్డి నూతన నాయకులను శాలువాలతో సన్మానించారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిపై అధికారుల నిర్లక్ష్యం

మణికొండ సర్వే నంబర్ 42, 45లో కోట్ల విలువైన భూమిపై అనుమానాలు

తిరిగి బోర్డు, కంచె ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



రాజేంద్రనగర్, నవంబర్1 (జనంసాక్షి) : నర్సింగ్ సర్కిల్ పరిధిలోని మణికొండ జాగీర్ గ్రామం పంచవటి కాలనీ సమీపంలోని సర్వే నం.42లో సుమారు 1,450 చదరపు గజాల ప్రభుత్వ భూమి విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి సుమారు రూ.45 కోట్లు ఉంటుందని అంచనా. గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిగా గుర్తించి ఏర్పాటు చేసిన బోర్డును తొలగించడంతో పాటు, భూమిలో కొంత భాగాన్ని ప్రైవేటు భూమిగా చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ భూమికి సంబంధించిన వివరాల కోసం ఆగస్టు 11, 2026న గండిపేట తహసీల్దార్, వట్టినాగులపల్లి సబ్‌రిజిస్ట్రార్, మున్సిపల్ సర్కిల్-45 డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీఏ అధికారులకు ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు సమాధానాలు రాకపోవడంపై స్థానిక టీఆర్ఎస్ నేత సీతారాం దులిపాల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ 27న సంబంధిత అధికారులు భూమిని సర్వే చేసిన నేపథ్యంలో, ప్రభుత్వ భూమి హద్దులను స్పష్టంగా గుర్తించి పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూమిగా సూచించే బోర్డు ఏర్పాటు చేసి, భూమి చుట్టూ కంచె నిర్మించి ఆక్రమణలకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాపులు, రిజిస్ట్రేషన్ వివరాలను సమగ్రంగా పరిశీలించి భూమి యాజమాన్యంపై స్పష్టత ఇవ్వాలని, ఆర్టీఐ దరఖాస్తులకు స్పందించని అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓట్ బచావో - దేశ్ బచావో నిరసనలో వజ్రేష్ యాదవ్

ఢిల్లీ రాంలీలా మైదానంలో ఏఐసీసీ ఆధ్వర్యంలో భారీ నిరసన

భారీఎత్తున పాల్గొన్న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు, కార్యకర్తలు, భాగస్వామ్యం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 01 (జనంసాక్షి) : ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహించిన 'ఓట్ బచావో--దేశ్ బచావో' నిరసన కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యాన్ని చాటిచెప్పే లక్ష్యంతో దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం నిర్వహించిన ఈ నిరసనలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఏఐసీసీ పిలుపునకు స్పందించి వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఢిల్లీకి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా నిలిచారు.













మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

బీజేవైఎం నేత విక్రమ్ సింగ్ పిలుపు



కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను గౌరవించని కాంగ్రెస్ విధానాలకు నిరసనగా భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించే మహా పాదయాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర పదాధికారి, అడ్వకేట్ విక్రమ్ సింగ్ పిలుపునిచ్చారు. నవంబరు 2న హైదరాబాద్‌లో నిర్వహించే ఈ పాదయాత్రకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు విక్రమ్ సింగ్ తెలిపారు. యువతతో పాటు తెలంగాణ ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిజాం కళాశాల ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై మొజాంజాహీ మార్కెట్ ఎక్స్ రోడ్స్ వరకు కొనసాగనందుంది అన్నారు.

కీసర చౌరస్తాలో మళ్లీ వెలుగులు

హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలకు మరమ్మతులు

అధికారులకు తుడుం శ్రీనివాస్ కృతజ్ఞతలు



కీసర, నవంబర్ 01 (జనంసాక్షి) : కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పనిచేయని హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలకు అధికారులు మరమ్మతులు చేయించారు. దీంతో చౌరస్తాలో తిరిగి వెలుగులు నిండటంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు తొలగాయి. కీసర ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్లు, వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కీసర మండల సామాజిక సేవా కార్యకర్త తుడుం శ్రీనివాస్, శీలం మల్లేష్, రాగుల రమేష్ ముదిరాజ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంఎంసీ కీసర సర్కిల్-1 డిప్యూటీ కమిషనర్ రామలింగం ఆదేశాలతో సంబంధిత అధికారులు ఆదివారం లైట్ల మరమ్మతులు పూర్తి చేయించారు. దీంతో చౌరస్తాలో విద్యుత్ దీపాలు వెలగడంతో రాకపోకలు సాగించే వారికి ఉపశమనం లభించింది. ప్రజా సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించిన డిప్యూటీ కమిషనర్ రామలింగంతో పాటు సంబంధిత అధికారులకు తుడుం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యుడు శీలం మల్లేష్, గ్రామ యువ నాయకుడు సుమన్ బన్నీ పాల్గొన్నారు.

జల్లి వెంకటేష్ ముదిరాజ్ గృహప్రవేశ వేడుకకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, నవంబర్1(జనంసాక్షి) : నార్సింగి సర్కిల్ పరిధిలో జల్లి వెంకటేష్ ముదిరాజ్ నూతన గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ హాజరై నూతన గృహ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగి డివిజన్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే ఏఎంసీ చైర్మన్ కోట వేణు గౌడ్, మాజీ ఎంపీటీసీ సాయిరాం ముదిరాజ్, నార్సింగి సర్కిల్ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జల్లి వెంకటేష్ ముదిరాజ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, అభిమానులు, బంధుమిత్రుల రాకతో నార్సింగి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొని, గృహప్రవేశ వేడుక జాతరను తలపించింది.